నవభూమి
www.navabhoomi.in
7
హైదరాబాద్
సోమవారం
09,జూన్,2025



## మృగశిర ఆగమనం

**గద్వాల-నవభూమి:**భారతీయ జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక్కో నక్షత్రానికి .. ఒక్కో కార్తెకు.. రాశికి ప్రత్యేకత ఉంటుంది.. అందులో మృగశిరకు మరింత విశిష్టత ఉన్నది.. రోహిణి కార్తెతో రోళ్లు పగిలే ఎండలతో సతమతమైన జీవకోటికి మృగశిరం చల్లని కబురు చెబుతుంది.. ఈ కార్తెలోనే రుతుపవనాల ఆగమనం జరుగుతుంది.. ఈ కార్తెను రైతులు ఏరువాక సాగే కాలం అంటూ సాగు పనులు చేపడతారు.. అంతేగాక ఈ కార్తెలో చేపలు విరివిగా తినడం వల్ల అనేక రోగాలు నయం అవుతాయి.. అదే నమ్మకంతో కార్తెనాడు చేపమందును తీసుకోవడం ఆనవాయితీగా వస్తుంది.. అంతేగాక మృగశిర కార్తెకు పురాణాల్లో కూడా ఎంతో విశిష్టత ఉన్నది.. ఈ కార్తె గురించి భగవద్గీతలో.. పురాణాల్లో ప్రత్యేక స్థానం ఉండడం విశేషం.మృగశిర కార్తెను ప్రతి ఏడాది జూన్ మాసంలో జరుపుకొంటారు. సూర్యుడి మృగశిరంలోకి ప్రవేశంచడంతో మృగశిరకార్తెగా పిలుస్తారు. అంతేకాక మృగశిర నక్షత్రానికి చంద్రుడు 14 రోజులు సమీపంలో ఉంటాడు.. అందుకే మృగశిర అనే పేరు వచ్చింది. ఈ కార్తెలో నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించడం జరుగుతుంది. రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఉన్న ఎండలతో సతమతమైన జీవకోటికి చల్లని వాతావరణం ఈ కార్తె అందిస్తుంది. తొలకరి జల్లులు కురిసి పుడమి చల్లబడి సాగుకు అనుకూలంగా మారుతుంది.

## కుర్తివాడలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**పాపన్నపేట-నవభూమి:** మండల పరిధిలోని కుర్తివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ పని కూడా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకిష్టయ్య, సీతారాములు, శంకర్, బాల్ రాజు మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**18 ఏళ్ల తర్వాత కలుసుకుని జ్ఞాపకాలు పంచుకున్న స్నేహితులు**





**గరిడేపల్లి జూన్ 8 నవభూమి న్యూస్ :**మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం గడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత కలుసుకున్న నాటి విద్యార్థులంతా ఒకే చోట చేరి జ్ఞాపకాలను పంచుకున్నారు. నేటి తమ స్థితిగతులను ఒకరినొకరు అడిగి తెలుసుకొని ఆనందంగా గడిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత తమందరం ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉంది అన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి నేడు సమాజంలో ఉన్నతంగా ఎదిగేలా తీర్చి దిద్దిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నాటి విద్యార్థులంతా వివిధ రంగాల్లో ఉన్నత స్థితిలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాటి అధ్యాపకులు వెంకటప్పయ్య, పూర్ణచంద్రారెడ్డి, మధుసూదన్, బుచ్చిరెడ్డి, శ్రీను, మంగళ, అనిత, బిక్షపతి, వెంకట్ రెడ్డి, మరియు ఆనాటి విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం పెంపొందే విధంగా పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలి

**డాక్టర్ మువ్వా**



**మిర్యాలగూడ నవభూమి, జూన్ 8:-** దేశం సాంకేతికంగా అభివృద్ధి చెంది ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం పెంపొందించే విధంగా పాఠ్యాంశాల్లో మార్పులు తేవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. ఆదివారం మిర్యాలగూడ జ్యోతి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన విద్యా విధానం- శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పించుటకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నల్గొండ జిల్లా అధ్యక్షులు సుదర్శనరెడ్డి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పు తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ హెచ్ ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. సెమినార్లో వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జె.కొండల్ రెడ్డి, పి.సత్యనారాయణరావు యుటిఎఫ్ నాయకులు బక్కా శ్రీనివాసాచారి, బీసం రామయ్య, జ్వాల వెంకటేశ్వర్లు, బిక్షమయ్య గణేష్, రాముడుశర్మ, కిరణ్మయి, మధుసూదన్, నాయుడు, పి.శ్రీనివాస్, ప్రశాంత్, సందీప్ శ్రీధర్, జానకిరాములు, దశరథరెడ్డి పాల్గొన్నారు

## కలుషితమవుతున్న మిషన్ భగీరథ వాటర్



**కాటారం,జూన్ 8 నవభూమి ప్రతినిధి:**కాటారం మండల కేంద్రంలోని తోట వాడలో గత పక్షం రోజుల నుండి భగీరథ పైప్ లైన్ లీకేజీ అవుతూ, డ్రైనేజీ వాటర్ మొత్తం భగీరథ పైప్ లైన్ లోకి వెళుతూ త్రాగు నీరు మొత్తం కలుషితం అవుతున్న ఎవరూ పట్టించు కోవడం లేదని తోట వాడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలు మార్లు అధికారులకు తెలిపిన పట్టించు కోవడం లేదని,కలుషిత మైన నీరు త్రాగడం వలన రోగాల పాలు కావడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి భగీరథ పైప్ లైన్ లోకి డ్రైనేజీ వాటర్ పోకుండా మరమ్మతులు చేయాలని,ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని తోట వాడ ప్రజలు కోరుతున్నారు.

# హైతాబాద్‌లో బరితెగించిన మట్టిమాఫియా

**◆ హైతాబాద్‌లో ఆగని అక్రమ మట్టి తవ్వకాలు ◆ హెచ్చరించిన బరితెగించి మట్టి తవ్వకాలు ◆ మైనింగ్‌ను తలపిస్తున్న అసైన్డ్ భూములు ◆ చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు**





**చేవెళ్ల, ప్రతినిధి జూన్ 08 (నవభూమి):**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలపరిధిలోని హైతాబాద్ సమీపంలోని పెద్దసోలిపేట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 350 లో అస్సైన్‌మెంటు భూముల్లో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. మట్టి తవ్వాకాలపై స్థానికులు మండల రెవెన్యూ, పోలీస్ అధికారులకు పిర్యాదు చేస్తే స్పందించరని , ఒకవేళ స్పందించిన తూతు మంత్ర చర్యలు చేపట్టి అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని స్థానికులు ఆరోపిపిస్తున్నారు. చర్యలు చేపట్టే దశలో పోలీస్ లే అక్రమార్కులకు సమాచారం ఇస్తున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి. మట్టి మాఫియా సాయంత్రం 7 గంటలకే టిప్పర్లతో హైతాబాద్ ప్రధాన చౌరస్తాలో అక్రమ మట్టి జాతర నడుస్తుంది. హైతాబాద్ చందనవెల్లి గ్రామాలు ఇండస్ట్రియల్ పార్క్ కు కేంద్రబిందువై ఉన్నందున ఇక్కడ భారీగా కంపెనీల నిర్మాణాలు జరుగుతున్నాయి. కంపెనీల నిర్మాణ దశలో పునాదులు, గ్రౌండ్ ఫ్లోర్ లెవెలింగ్ పనులకు ఒక్కో కంపెనీకి వందల టిప్పర్ల మట్టి అవసరమవుతుంది. పాతిక పైగా కంపెనీలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక్క రోజు 20 లక్షల అక్రమ ఎర్రమట్టి వ్యాపారం కొనసాగుతుంది. ఈ మట్టి కాంటాక్ట్ ను కాంట్రాక్టు ను స్థానికంగా రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు, కోట్ల రూపాయలకు చేజిక్కించుకుని, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులను మేనేజ్ చేసుకుని పట్ట పగలు మట్టిని కొల్లగొట్టి కోట్లు గడిస్తున్నారు. ఇంతజరుగుతున్న షాబాద్ మండల రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టుగా వదిలేస్తున్నారన్నారు. షాబాద్ మండలం పెద్ద సోలిపేట్, చందనవెల్లి, రుద్రారం, పెదవేడు, గ్రామాల పరిధిలో సుమారు 250 ఎకరాల ప్రభుత్వ అసైన్మెంట్ భూములలో మట్టిని తవ్వేశారు. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించకపోవడం గమనర్హం. జిల్లా గనులశాఖకు పిర్యాదు చేసిన స్పందించడంలేదు. స్థానికులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే మేమేం చేయలేం ఏదైనా ఉంటే మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని స్థానిక ఎమ్మార్వో అంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మట్టి మాఫియా రాజకీయ పార్టీ నేతల కనుసన్నల్లో రెచ్చిపోతున్నారు. వారం రోజుల క్రితం మట్టి తరలిస్తున్న లారీలను గ్రామానికి చెందిన కొంతమంది అడ్డుకున్నా.. వారించి వాదించి తీసుకెళ్తున్నారు. ఎన్ని విచారణలు జరిగితేనేం. ఎన్ని కేసులు నమోదైతేనేం.. ఎన్ని నోటీసులు జారీ చేస్తేనేం.. మమ్మల్ని ఆపేదెవరు అన్నట్లు పెద్దసోలిపేట్ మట్టి మాఫియా చెలరేగిపోతోంది. గనులు, రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో మట్టి తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. రెవెన్యూ, గనులశాఖల నుండి ఎటువంటి అనుమతులు లేకుండానే తవ్వేస్తున్నారు. మట్టితవ్వకాలకు ముందు కనిపించేవారు పాత్రధారులు మాత్రమేనని.. వీరి వెనుక పెద్దలు ఉన్నారని స్థానికులు అంటున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఇప్పటికే 250 ఎకరాలకు పైగా ప్రభుత్వ అసైన్ భూముల్లో 200 కోట్ల రూపాయల విలువైన మట్టిని తరలించారని అంచన.. సంవత్సరాలనుండి అక్రమంగా మట్టి తవ్వి తరలించుకుపోతుంటే రెవెన్యూ శాఖ ప్రభుత్వానికి కనీసం నివేదిక ఇవ్వకపోవటం గమనార్హం. దీనిపై జిల్లా కలెక్టర్ పర్యటించి మైనింగ్ ను తలపిస్తున్న మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు అంటున్నారు. గత కొన్ని రోజుల క్రితం మండల రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. వారం రోజులు సైలెంట్ గా ఉన్న మట్టి మాఫియా, మళ్ళీ వారం తిరగకముందే ఇప్పుడు ఎసైన్డ్ భూముల్లో.. మట్టిమాఫియా మరోసారి రెచ్చిపోయి తవ్వకాలు జరుపుతోంది. పేదలు సాగు చేసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పంచిన ఎసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు జరుపుతుంటే స్థానికులు ఫిర్యాదు చేస్తే గాని స్పందించని అధికారులు తూతు మంత్రంగా చర్యలు తీసుకుని వదిలేస్తున్న అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. "గత శనివారం నుండి హైతాబాద్ టౌన్ చౌరస్తా నే టిప్పర్లకు అడ్డా.. సాయంత్రం 8 గంటలకే 20 లారీలు 3 జేసీబీలతో పెద్దసోలిపేట్ సర్వేనెంబర్ 350 లో దర్జాగా అక్రమంగా మైలింగ్ ను తలపించేలా మట్టిని తవ్వేస్తున్నారు. మా గ్రామంలో అక్రమ తవ్వకాలు ఏమిటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవ్వరూ స్పందించటం లేదని ఎమ్మార్వో కు ఫిర్యాదు చేస్తే మాకు సంబంధం లేదు, మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేయాలని సూచించారని స్థానికులు వెల్లడించారు . అక్రమ మట్టి తవ్వకాల వెనుక అధికార పార్టీకి చెందిన నాయకులు పూర్తిగా అండగా ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఒకానొక సందర్భంలో లారీలు అడ్డిగించి అధికారులకు సమాచారమిచ్చినా ఎవ్వరూ రాలేదని ఆరోపిస్తున్నారు. భారీ ఎత్తున తవ్వకాలు జరుపుతు ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టం వాటిల్లుతుంటే రెవెన్యూ, మైనింగ్ శాఖలు నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 80 ఎకరాలు తవ్వి సుమారు 90 కోట్ల రూపాయలు మట్టి మాఫియా అక్రమార్కుల జేబుల్లోకి వెళ్ళాయని అంచనా. ఇదంతా చూస్తుంటే రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు అమ్ముడు పోయారన్నా.. ప్రచారం స్థానికంగా జోరుగా వినిపిస్తుంది.

# తనకు నష్టపరిహారం ఇప్పించండి మహా.. ప్రభో

**◆ ప్రభుత్వానికి మాజీ సైనికుడి వేడుకోలు◆ 5 ఎకరాలకు 45 లక్షల నష్టపరిహారం చెల్లించాలి◆ నష్టపరిహార చెల్లింపులలో అవకతవకలు ◆ తనకు రావలసిన నష్టపరిహారం**








**చేవెళ్ల, జూన్ 08 (నవభూమి):**దేశానికి సేవ చేసిన వ్యక్తి న్యాయం కోసం రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. దేశం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి రిటైర్డ్ అయినా మాజీ సైనికునికి ప్రభుత్వం నుండి న్యాయం దక్కడం లేదు. తనకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వ పెద్దలకు చెప్పుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, రెవెన్యూ అధికారుల చుట్టూ కాలరిగేలా తిరిగిన పట్టించుకున్న నాధుడే లేడని మాజీ సైనికుడు కె ఎస్ రెడ్డయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి రెవెన్యూపరిధిలోని సర్వేనెంబర్ 190 లో ఈ మాజీ సైనికునికి అప్పటి ప్రభుత్వం 2005 లో 5 ఎకరాల భూమిని కేటాయించి అసైన్డ్ పట్టా ఇచ్చింది. గత ప్రభుత్వం కంపెనీల కోసం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో భాగంగా రెడ్డయ్య భూమిని కూడా తీసుకుంది. అయితే ఈ భూములకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. నష్టపరిహారం చెల్లింపులో అవకతవకలు జరిగాయని, తనకు అందాల్సిన నష్టపరిహారం ఒక్క రూపాయి తనకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గత ప్రభుత్వంలో తనకు జరిగిన అన్యాయాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాను దేశానికి చేసిన సేవను గుర్తించి నా భూమి నాకు ఇవ్వాలని లేదా నష్టపరిహారమైన ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. చందనవెల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, తనకు అందాల్సిన నష్టపరిహారం బోగస్ పేర్లతో ప్రభాకర్ రెడ్డే తిన్నాడని ఆరోపించాడు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం పరిధిలోని చందన్వెల్లిలో సర్వే నెంబర్ 190లో 1181 ఎకరాల అసైన్ భూములను 2018లో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు కోసం రైతుల నుండి ప్రభుత్వం భూములు తీసుకుంది. ఇందుకు ఒక్కో రైతుకు ఎకరాకు 9 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించింది. ఇక్కడే ప్రభుత్వ మోసపూరిత వ్యవహారం బయటపడింది. 5 ఎకరాలు ఉన్న రైతుకు 2ఎకరాలకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చి పూర్తి భూమిని గుంజుకుంది. ఇలా 1100 ఎకరాల భూముల్లో ఇదే పరిస్థితి. ప్రభుత్వం రైతులకు ఇచ్చే నష్టపరిహారం లిస్టులో, అసలు రైతులకు బదులు అప్పటి ప్రభుత్వ నేతలకు అనుకూలమైన, అనుచరులు పేరు లిస్టులో చేర్చి అసలు రైతులకు అన్యాయం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ప్రభుత్వంపై రైతులు వ్యతిరేకత చూపి ఆందోళనలు,ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ పెద్దలను కలిసి తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. రావాల్సిన రావలసిన నష్టపరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వకుండానే భూములను కంపెనీలకు అప్పగించారని ప్రభుత్వంపై రైతులు తిరుగుబాటు చేశారు. అయినా ప్రభుత్వం రైతులపై కనికరం చూపలేదు. చందనవెల్లి భూములలో అవకతవకలు జరిగాయని, మా భూములు మాకు కావాలని, లేదా నిష్పక్షపాతంగా నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. నష్టపరిహారం ఇచ్చామని చెప్పిన ప్రభుత్వం ఎక్కడ పూర్తిస్థాయిలో భూ నిర్వాసితులు (రైతులకు) అందలేదని, ఆ డబ్బులు స్థానిక నాయకులు, నకిలీ రైతుల పేర్లు చేర్చి డబ్బులు నొక్కేశారని వారు ఆరోపించారు. నష్టపరిహారం చెల్లింపులో అవకతవకలు జరిగాయని, బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆదివారం చందన్‌వెల్లి రైతులు నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ చందన్‌వెల్లి భూముల్లోని సర్వేనెంబర్ 190లో జరిగిన అవకతవకలపై నష్టపరిహారం అందలేదన్నారు.మాజీ సైనికునికి సైతం అందని నష్టపరిహారం..చందనవెల్లి గ్రామానికి చెందిన కేఎస్ రెడ్డయ్య (మాజీ జవాన్ )కు అప్పటి ప్రభుత్వం రెడ్డయ్య సేవలకు గుర్తించి 2005 లో చందనవెల్లి గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 190 లో 5 ఎకరాల భూమికి పట్టా ఇచ్చింది. ఇదిలా ఉండగా కంపెనీల కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలో భాగంగా రెడ్డయ్య భూమి కూడా ప్రభుత్వం కంపెనిలకు కట్టబెట్టింది. దీనిపై రెడ్డయ్య ప్రభుత్వం నుండి తనకు రావాల్సిన నష్టపరిహారం చందనవెల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డినే ఆ డబ్బులు తిన్నాడని రెడ్డయ్య ఆరోపించారు. నష్టపరిహారం డబ్బులు ఒక్క రూపాయి కూడా తనకు అందలేదని, కానీ ప్రభుత్వం తన భూమిని తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రెడ్డయ్య విలేకరులతో మాట్లాడుతూ..తన భూమిలో (సారస్ హైజిన్ కంపెనీ) యాజమాన్యం దౌర్జన్యంగా తన భూమిలో భూమిపూజ చేశారని, ప్రశ్నించిన తనను కంపెనీ యాజమాన్యం బెదిరిస్తున్నారని రెడ్డయ్య తన ఆవేదనను వ్యక్తపరిచారు. ప్రభుత్వం దీనిపై పూర్తి విచారణ జరిపి నష్టపరిహార చెల్లింపులలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రెడ్డయ్య ఒక్కడే కాదు గ్రామానికి చెందిన రైతులు కిష్టయ్య గౌడ్ 3 ఎకరాల భూమికి 1 ఎక్కడకు మాత్రమే నష్టపరిహారం అందింది. అనంతం 3 ఎకరాలకు 1 మాత్రమే నష్టపరిహారం అందింది. రాంబాబు గౌడ్ 5 ఎకరాలకు 2 మాత్రమే నష్టపరిహారం అందింది. రైతులకు సగం భూములకు మాత్రం నష్టపరిహారం చెల్లించిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని పోరాటం చేస్తున్నారు చందనవెల్లి భూ నిర్వాసితులు.భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం.. నీరటి ఆంజనేయులు చందనవెల్లి భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇండస్ట్రీ పేరుతో రైతుల నుండి బలవంతంగా 1200 ల ఎకరాల భూమి లాక్కుని కంపెనీలకు కట్టబెట్టిందని అన్నారు. తీసుకున్న భూములకు బదులుగా రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారంలో అవకతవకలు జరగాయని ఆరోపించారు. చందనవెల్లి లో జరిగిన ఎన్నికల పాదయాత్రలో గత ప్రభుత్వం తమకు చేసిన అన్యాయాన్నికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూనిర్వాసితులకు న్యాయం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, గత ఎన్నికలలో తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాట మార్చి గత ప్రభుత్వ అరచివేత ధోరణిని ప్రదర్శిస్తుందని రైతులు తీవ్రంగా మండిపడ్డారు. రైతులకు నష్టపరిహారం చెల్లింపులో స్థానిక నేతలతో రెవెన్యూ అధికారులు కూడా కుమ్మక్కయి రైతులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ రైతులు నిరసన చేపడితే ప్రభుత్వం పోలీసుల చేత అక్రమ కేసులు పెట్టించిందని వాపోయారు. తమకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం చేస్తామని చందనవెల్లి భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నీరటి ఆంజనేయులు, అనంతయ్య, రాంబాబు గౌడ్, కిష్టయ్య గౌడ్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సైనిక పాఠశాలలుమా హక్కు

**◆ వెంటనే ఏర్పాటు చేయాలి :మట్టిమనుషుల ట్రస్టు వ్యవస్థాపకులు వేనేపల్లి**



**మిర్యాలగూడ నవభూమి, జూన్ 8:-** తెలంగాణకు సైనిక స్కూలు హక్కు అని వెంటనే కేటాయించాలని కోరుతూ మట్టి మనుషులు ట్రస్టు వ్యవస్థాపకులు వేనేపల్లి పాండురంగారావు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సమర్పించిన లేఖలో కోరినట్టు విలేఖరులకు ఆదివారం తెలిపారు.తెలంగాణ రాష్ట్రము సాధించు కున్నది సబ్బండ వర్ణాల సకల జనుల విజయం సాకారమై పన్నె%శీ%డెండ్లు( ఒక పుష్కర కాలం ) అయినా కొన్ని ఎక్కడ వేసిన గొ%శీ%గలి అక్కడే అన్నట్లు వుందన్నారు. ఆంధ్రప్రదేశ్ సైనిక్ స్కూలున్న మరో మూడు కేటాయించారన్నారు. అందులో కీలకమైన తెలంగాణను ముందుకు తీసుకువెళ్లే అభివృద్ధి పథకంలో నిలబెట్టే విద్య ఒకటన్నారు.విద్య విషయం లో మనం చేయాల్సినవి చేసుకోవడం లేదన్నారు.మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం మనం ఇంకా కొన్ని చేయాలి. అందులో ఒకటి న్యాయంగా మనకు రావాల్సిన, కేంద్రం నుంచి దక్కాల్సిన సైనిక పాఠశాలలు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే జరగాల్సిన మొదటి పని అది..ఇప్పటి దాకా సాకారం కాలేదు.ఇంకో వారం పది రోజుల్లో అన్ని పాఠశాలలు ప్రారంభ%శీ% కానున్నాయన్నారు.సైనిక పాఠశాలలు పురోగతిని సమీక్షించాలన్నారు.అలాగే దగ్గర సైనిక పాఠశాలలు ప్రారంభం అయ్యేవరకు ఆంధ్రప్రదేశ్ సీఎం తో మాట్లాడి మన విధార్థులను కూడా వాళ్లకున్న హెూమ్ స్టేట్ 67 శాతంలోనే చేర్చుకునేలా చూడాలన్నారురు.హెూమ్ స్టేట్ హెూదాను కలిపించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సైనిక పాఠశాలలో చదువుకునే మన విద్యా ర్థులను స్థానికులుగా గుర్తి%శీ%చేవిధంగా అనుమతి ఇవ్వలన్నారు.2025-26 విద్యా సంవత్సరానికి గాను దాదాపు 20 వేల మంది విద్యార్థులు గత ఏప్రిల్లో ప్రవేశ పరీక్షలు కూడా రాసారు.వారి భవిష్యత్తును ద్రుష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ సీఎం, ప్రధాన మంత్రిని సంప్రదించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఇప్పుడు తెలంగాణ పిల్లలు ఆంధ్రప్రదేశ్ లో ఆ 33 శాతం లో దేశ వ్యాప్త విద్యార్థులతో పోటీ పడవలసి వస్తుందన్నారు.సైనిక పాఠశాలలు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహణలో జరిగేటట్టుగా చూడాలన్నారు. వాటికి సాంఘిక సంక్షేమ శాఖ నిధులు గాని విధులు గాని కేటాయించకుండా చూడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ఇప్పుడున్న కోరుకొండ సైనిక పాఠశాల కాకుండా మరో మూడు కేటాయించారు.తెలంగాణకు ఒక్కటి కూడా గతి లేదు మరికొన్ని కేటాయించి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి నిర్మించాలన్నారు.కేంద్రం పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) తో కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేస్తుంది ఇలా కూడా మనకు కొన్ని పాఠ శాలలు వచ్చేలా చూడాలన్నారు.


## నరేంద్ర మోదీ నరమేధాన్ని ఆపాలి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి-నవభూమి :**నరేంద్ర మోదీ నరమేధాన్ని ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొండ బానేష్ డిమాండ్ చేశారు.ఆదివారం తాండూరు మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపి వేయాలి 2026 మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఫాసిస్టు చర్యల్లో భాగమేనని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటివరకు 540 మందిని చట్ట విరుద్ధంగా హత్య చేశారని, మృతుల్లో ఆదివాసీలు ఎక్కువగా ఉన్నారని అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు.అక్కడి ప్రజలు భయానక స్థితిలో జీవనం కొనసాగించాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడ్డాయని ప్రాథమిక హక్కులు కోల్పోతున్నారని తక్షణమే న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ చట్ట విరుద్ధ హత్యలను భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని మావోయిస్టులు కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కొనసాగించడం దుర్మార్గమని అన్నారు.శాంతి చర్చల కమిటీ 10 వామపక్ష పార్టీలు,లౌకిక శక్తుల ఆధ్వర్యంలో అన్ని జిల్లాలలో వివిధ రూపాలలో సభలు,సమావేశాలు జరపాలని ఈనెల 14న హైదరాబాదులో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేధావులు బుద్ధి జీవులు పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి మలిశెట్టి సత్యనారాయణ,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందారపు రాజేష్,కంబాల చందు,మీసాల సన్యాసి, గజ్జల వెంకన్న, చీకటి భీమేష్, శాలిగామ రాగులయ్య,కొండు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



నవభూమి
www.navabhoomi.in
8 హైదరాబాద్ సోమవారం 09.జూన్.2025

# నకిలీ విత్తనాలపై నజర్ ఏది ?



**నర్సింహులపేట-నవభూమి :**వర్షాకాలం సమీపిస్తున్నది.. అదునుకు వానలు పడుతుండడంతో విత్తనం వేసేందుకు రైతులు దుక్కులు, వరినారు పోసేందుకు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇదంతా బాగానే ఉన్నా పంటల సాగు, విత్తన ఎంపిక విషయంలో రైతులకు వ్యవసాయ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి సూచనలు, సలహాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. దీంతో అన్నదాతలు అదునుకు దొరికే నకిలీ బీటీ విత్తనాలు, నాణ్యతలేని సీడ్స్‌ను వాడి మోసపోతున్నారు. పంట వేశాక పూతకాత లేక రైతులు నష్టపోతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా నకిలీ విత్తనాలు వస్తున్నా పట్టించుకునే వారు లేరు. కొందరు కేటుగాళ్లు కలుపు మందు వాడినా పత్తి మొక్క చనిపోదని బీటీ-3 పేరుతో గ్రామాలు, తండాల్లో రైతులకు మాయమాటలు చెప్పి అంటగడుతున్నారు. వివిధ కంపెనీల విత్తనం కంటే తమ విత్తనమే నాణ్యమైనదని, తక్కువ రేటుకు ఇస్తామని రైతులు నమ్మించి మోసం చేస్తున్నారు. ఏటా అధికారులు నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై ఉక్కుపాదం మోపుతున్నా ఈ దందాకు మాత్రం చెక్ పడడంలేదు.నకిలీలపై ఉక్కుపాదం మోపి నిందితులపై పీడీయాక్టులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతో పాత నేరస్తులు మళ్లీ రెచ్చిపోతున్నారు. సీజన్ మొదలుకాగానే అమాయక రైతులను లక్ష్యంగా చేసుకొని యథేచ్ఛగా దందా చేస్తున్నారు. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ సహా పలుచోట్ల తరచూ నకిలీ విత్తనాలు, పురుగుల మందు విక్రయ ముఠాలు పట్టుబడుతున్న విషయం ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన సీరియస్‌గా తీసుకున్నారు.

## మాగంటికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు





**మిర్యాలగూడ నవభూమి, జూన్ 8:-**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భౌతికకాయానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు నివాళులర్పించారు.ఆయన నివాసానికి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు గోపీనాథ్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. మంచి మిత్రుడిని కోల్పోయామన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**కాటారం,జూన్ 8 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఆదివారం రోజున మంథని నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు.వివరాల్లోకి వెళితే గంగారం గ్రామానికి చెందిన చిట్యాల దుర్గయ్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.అలాగే అదే గ్రామంలో నాలుగు రోజుల క్రితం కారు యాక్సిడెంట్ లో మృతి చెందిన మారుపాక మధునమ్మ,నీలాల బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.అనంతరం చింతకాని గ్రామానికి చెందిన నీడికొండ రవి కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుచుండగా విషయం తెలుసుకున్న పుట్ట మదూకర్ రవి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నాడు.ఈ కార్యక్రమంలో కాటారం మండల బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ జోడు శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రామిల్ల కిరణ్,పార్టీ నాయకులు వూర వెంకటేశ్వరరావు,ఉప్పు సంతోష్, కొండపర్తి రవి,గాజుల విక్రమ్ కుమార్, చిట్యాల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదోళ్ల సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్లు..!!

### కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్

**పాలకుర్తి నవభూమి జూన్ 08 :**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశానుసారం...జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని నరసింగాపురం గ్రామంలోప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ఆదివారంముఖ్య అతిథిగా పాల్గొనిఇంటి నిర్మాణాలకుకొబ్బరికాయ కొట్టి ముగ్గులు పోశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నేతృత్వంలో, కాంగ్రెస్ ప్రభుత్వం, తొలిదశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇల్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు, తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా వేనకబడిన, వర్గాలకు , ఇల్లు నిర్మించుకోవడానికి, సహాయం అందించడమే లక్ష్యంగా, ఇందిరమ్మ ఇల్లుపథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందన్నారు, మూడు దశల్లో ఆర్థిక సహాయం అందిస్తూ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమచేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నూనేమంతల శివ నర్సయ్య,ఏఎంసీ డైరెక్టర్ రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు కప్పల రంగయ్య,సీనియర్ నాయకులు పనస శ్రీనివాస్ గౌడ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,మహిళలు, గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### అంతర్జాతీయ యోగా దినోత్సవం

# వేడుకలను విజయవంతం చేయాలి





**హైదరాబాదు-నవభూమి:**జూన్ 20వ తారీకు లాల్ బహదూర్ స్టేడియంలో జరుగుతున్నటువంటి 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ ప్రెసిడెంట్ శ్రీ రవి కిషోర్ తెలియజేశారు హైదరాబాదులో ఉన్నటువంటి విశ్వా సెంటర్లో జరిగిన మీటింగ్లో మాట్లాడుతూ యోగాకు హైదరాబాదులో ప్రజలు పెద్దపీట వేస్తారని ప్రస్తుత తరుణంలో రకరకాల మానసిక శారీరక అనారోగ్యాలనుంచి బయటపడేసేది కేవలం యోగ మాత్రమే అటువంటి యోగాను ఆంధ్రప్రదేశ్ తెలంగాణ లో విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలకు తెలంగాణలో ఉన్నటువంటి అన్ని యోగా సెంటర్ల నుంచి మరియు యోగ పట్ల ఆసక్తి కలిగిన అందరిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్ రమేష్ గురుజీ స్టేట్ కోఆర్డినేటర్ విశ్వక్ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌతమ్ వినోద్ ప్రమీల ఆర్గనైజింగ్ టీం సతీష్ మహాదేవి అనిల్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారి సమక్షంలో నిన్న జరిగినటువంటి మీటింగ్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంతో గతంలో జరిగిన దానికన్నా అధిక స్థాయిలో విజయవంతం చేయాలని అందుకు అన్ని ఆధ్యాత్మిక సంస్థల సహకారం తప్పక అందుతుందని ప్రతి ఒక్కరూ మాట్లాడుతూ తెలియజేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ అందరి యొక్క ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు వెళుతున్న తరుణంలో తెలంగాణ యోగా కఆర్డినేషన్ కమిటీ



మరియు జేఏసీ మరియు ఇతర ఆధ్యాత్మిక సంస్థల వారికి తన ఎప్పుడు సహకరిస్తానని ఇటువంటి కార్యక్రమాలు ఇంకా ఎన్నో నిర్వహించాలని అందుకు కావలసిన ఏర్పాట్ల విషయంలో నేను ఎప్పుడూ ముందుంటాను అని తెలియజేశారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారి సమక్షంలో జరిగినటువంటి మీటింగ్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అధ్యక్షులు శ్రీ రవి కిషోర్ గారు తెలిపారు ఎన్నో ఆధ్యాత్మిక సంస్థలు కలిపి నిర్వహించే కార్యక్రమంలో అన్ని చేతులు కలుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# ఖమ్మం పెద్దాసుపత్రి కంపు కొడుతోంది

**ఖమ్మం‘-నవభూమి:**రెక్కాడితే కానీ డొక్క నిండని నిరుపేద కార్మికులు.. వారిలో ఒంటరి మహిళలు సైతం ఉన్నారు.. రోజువారీగా మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్నప్పటికీ.. వార్డుల్లో చెత్తాచెదారం లేకుం డా పరిశుభ్రంగా ఉంచుతున్నప్పటికీ.. ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా మార్చినప్పటికీ ఆకలి కేకలు తప్పడం లేదు. నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ నెలవారీగా వేతనాలు చెల్లించేందుకు కాంగ్రెస్ సర్కారుకు చేతులు రావడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతన సమస్య మొదటికి వచ్చింది.స్థానిక వైద్యాధికారుల నిర్లక్ష్యమో, గుత్తేదారుడి అలసత్వమో వెరసి ప్రస్తుత నెలతో కలిపి నాలుగు నెలలుగా బడుగు జీవులు బుక్కెడు బువ్వ కోసం రోడ్లెక్కే పరిస్థితి దాపురించింది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. పేషెంట్ కేర్, గార్డెన్, శానిటేషన్ విభాగాల్లో పనిచేస్తున్న దాదాపు 259 మంది నెలవారీ వేతనం కోసం విధులు బహిష్కరించి ఆందోళనబాట పట్టారు. వారికి బీఆర్ఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాలు బాసటగా నిలవడంతో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు తీర్మానించుకున్నారు. అంతా కలిసి శుక్రవారం దవాఖాన ఎదుట ధర్నాకు దిగారు. కాగా.. తాజా సమస్య కేవలం గత ఏడాదిన్నరగా ఉత్పన్నం కావడం గమనార్హం.కంపు కొడుతున్న దవాఖాన జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు వేతన బకాయిలు చెల్లించాలంటూ సమ్మెకు దిగారు. దీంతో శనివారం వైద్యసేవల నిమిత్తం వచ్చిన రోగులకు పట్టపగలే చుక్కలు కనిపించాయి. దవాఖానలో అడుగుపెడితే కడుపులో పేగులు బయటికి వచ్చేంత మురుగు కంపు స్వాగతం పలుకుతోంది. ఏ మూలనచూసినా వ్యర్థాల గుట్టలు దర్శనమిస్తున్నాయి. కనీసం మంచినీళ్లు కూడా దొరకని దుస్థితి నెలకొంది. వృద్ధులు, నడవలేని వారిని, ప్రసవం కోసం వచ్చే గర్భిణులను కనీసం స్ట్రెచర్‌తో లోపలికి తీసుకెళ్లే వారే కరువయ్యారు. రోగుల సహాయకులుగా వస్తున్న వారి కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్తున్న ఘటనలు హృదయ విదారకంగా దర్శనమిస్తున్నాయి.ఈ విషయంపై కాంగ్రెస్ సర్కారుకు చెందిన మంత్రులు, పెద్దలు పట్టించుకున్న పాపానపోవడం లేదు. స్థానిక గుత్తేదారు, వైద్యాధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటున్నరు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు రోజుకు రూ.వెయ్యి చెల్లించి ప్రైవేటు వ్యక్తులను తీసుకొచ్చి పారిశుధ్య పనులకు పురమాయించారు. కానీ.. బాత్రూములు, కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలు కుళ్లిన వాసన వస్తుండటంతో వారు కూడా తూతూమంత్రంగా తంతు ముగించారు.మంత్రులు వస్తున్నారని..తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఆందోళనకు దిగడం ఇదే మొదటిసారి కాదు. కేవలం నెలవారీ వేతనాలు చెల్లించండి మహాప్రభో అంటూ రోడ్డెక్కడం



ఏడవ దఫా. గత మే నెలలో సైతం వారంతా ధర్నాకు దిగితే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జోక్యం చేసుకున్నారు. నాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఎలాగైనా సమ్మె విరమించేలా చూడాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు.తక్షణమే రంగంలోకి దిగిన యంత్రాంగం జిల్లా పరువు తీయవద్దని కార్మికులను బతిమాలుకున్నారు. తక్షణమే ఒక నెల వేతనం చెల్లించి, మిగతావి ఇరవై రోజుల్లో వచ్చేలా చూస్తామని నమ్మబలికారు. వారు అనుకున్న లక్ష్యం నెరవేరి అధికారిక కార్యక్రమం ముగిసిన తర్వాత ఇప్పుడేమో తమకేమీ సంబంధం లేనట్లుగా చేతులెత్తేశారు. దీంతో ఆగ్రహించిన వేతనజీవులు గత్యంతరం లేని పరిస్థితుల్లో మరోమారు సమ్మెకు పిలుపునిచ్చారు. ‘మార్పు’ అంటూ అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పెద్దలకు తమ వేతన సమస్య ఏమాత్రం పట్టింపులేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డీఎంఈ ఆఫీసు ముట్టడి?జిల్లా ప్రభుత్వాసుపత్రికి ఉమ్మడి ఖమ్మంతోపాటు కోదాడ, మహబూబాబాద్, కృష్ణా జిల్లాలకు చెందిన రోగులు రోజుకు దాదాపు రెండువేల మంది వరకు వైద్యసేవల నిమిత్తం వస్తుంటారు. వారితోపాటు మరో వెయ్యి మంది వరకు రోగుల సహాయకులు సైతం ఉంటారు. వారందరికీ పారిశుధ్యం, వార్డుల్లో, రకరకాల విభాగాల్లో ఎలాంటి అసౌకర్యం కలుకుండా చూసేది కేవలం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు మాత్రమే. వారందరికీ బీఆర్ఎస్ హయాంలో నెలవారీగా లేదా రెండు నెలలకు ఒకసారైనా పూర్తి స్థాయిలో వేతనాలు అందేవి.కానీ.. అత్యవసరమైన వైద్యరంగంపై జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులకు ఏమాత్రం పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా నెలకొంటున్న వేతన సమస్య గురించి ఏడాదిన్నర పాలనలో ఒక్కరోజు కూడా సమీక్ష నిర్వహించకపోవడం విస్తుగొలుపుతోంది. దీంతో పెద్దాసుపత్రి కార్మికులు తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు వినికిడి. అంతా కలిసి హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయాన్ని ముట్టించాలని తీర్మానించుకున్నట్లు తెలుస్తోంది. దీనికిగాను కార్మిక సంఘాలు సైతం సంపూర్ణ మద్దతు తెలపడం విశేషం.

# రేవంత్‌కు సాగు జలాలపై అవగాహన లేదు



**యాదగిరిగుట్ట-నవభూమి:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 15వ ప్యాకేజీ టెయిల్‌ఎండ్ భాగంగా నిర్మితమైన గంధమల్ల జలాశయ రూపశిల్పి కేసీఆరేనని, 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతో స్వామివారి పేరిట యాదగిరిగుట్టకు వైద్య కళాశాలను మంజూరు చేసిన ఘనత రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్‌కే దక్కుతుందని టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం యాదగిరిగుట్ట బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై విరుచుకుపడ్డాడు.కాళేశ్వరం ఎత్తిపోతల ఫథకంలో భాగంగా ఆలేరు నియోజకవర్గానికి సాగుజలాలు అందించాలన్న లక్ష్యంతోనే 2019 ఫిబ్రవరిలోనే 9.8 టీఎంసీ సామర్థ్యంతో ప్రతిపాదించారని అన్నారు. అనంతరం భూ సేకరణ సమస్య రావంతో 4.2 టీఎంసీకి కుదించడంతోపాటు గ్రామస్తుల కోరిక మేరకు రీడిజైన్ చేసి 1.41 టీఎంసీ కుందించి నిర్మాణ పనులు చేపట్టాలని పరిపాలన అనుమతులతోపాటు నిధులు కూడా మంజూరయ్యాయని స్పష్టం చేశారు. నిర్మాణ పనులు కాంట్రాక్టు అప్పగించారని తెలిపారు.కాంట్రాక్టు పనులు గుత్తా అమిత్‌రెడ్డి దుక్కించుకొని పనులు ప్రారంభిస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుపడి ప్రాజెక్టు పనులు జరుగకుండా చేశారన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని అబద్ధాలు చెప్పిన రేవంత్‌రెడ్డి గంధమల్లకు ఎలా నీళ్లు తీసుకువస్తారో చెప్పాలన్నారు. ఎల్లంపల్లి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుల నుంచి గంధమల్లకు సాగునీళ్లు తీసుకువస్తారని చెప్పిన రేవంత్‌రెడ్డి సాగు జలాలు మీద అవగాహనలేదన్నది స్పష్టమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మితమైన మల్లన్నసాగర్ నుంచే గంధమల్లకు జలాలు వస్తాయన్నారు.మళ్లీ శంకుస్థాపన చేయడానికి సిగ్గుండాలే..ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు చేసిన పనులను తిరిగి శం కుస్థాపనలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. కొలనుపాక, కాల్వపల్లి హై లెవల్ బ్రిడ్జి నిర్మాణపు పనులకు మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత శంకుస్థాపన చేశారన్నారు. ఆలేరు కు రూ.1051.45 కోట్ల పనులను తీసుకువచ్చామని ఎమ్మెల్యే అయిలయ్య ప్రచార ఆర్భాటమేనని గుర్తుచేశారు. ఇందులో కేవ లం రూ.200 కోట్ల ఇంటిగ్రెటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ మిన హా మిగతా పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసివేనని అన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానాన్ని కేసీఆర్ రూ.1300 కోట్ల తో పునర్నించారని గుర్తు చేశారు. స్వామివారి విమా న గోపురం స్వర్ణతాపడం పనులు గత ప్రభుత్వమే చేపట్టడంతో పాటు సుమారు 100 కిలోల బంగారాన్ని సమకూర్చారని స్పష్టం చేశారు.

## మేడిగడ్డ మృతుల కుటుంబాలను పరామర్శించిన మాల మహానాడు రాష్ట్ర నాయకులు

### మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

### మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్ డిమాండ్



**కాటారం,జూన్ 8 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజి ఎగువ ప్రాంతం గోదావరిలో శనివారం రోజు సాయంత్రం ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జెల్ల ప్రభాకర్ ఆదివారం రోజున మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. సరదాగ ఈతకు వెళ్లి దుర్మరణం పాలైన యువకులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం నుండి 25 లక్షల ఎక్స్ గ్రెసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇంత పెద్ద సంఘటన జరిగినా ఘటనా స్థలానికి ఏ ఒక్క రాజకీయ నాయకుడు రాక పోవడం బాధాకరం అని అన్నారు.మృతి చెందిన యువకులు అందరూ 18 సంవత్సరాల లోపు యువకులు కాబట్టి మంత్రి శ్రీధర్ బాబు చొరవ తీసుకుని ప్రభుత్వం నుండి అందాల్సిన ఎక్స్ గ్రేషియా తొంతరగా అందించే విధంగా చూడాలని కోరారు.ఈ సంఘటన పూర్తిగా పర్యవేక్షణ లోపం తో జరిగిందని,దీనికి సంబంధించిన అధికారుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు కందుగుల రాజన్న,మాజీ జిల్లా అధ్యక్షుడు పసుల అశోక్, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం మాజీ డైరెక్టర్ బండి రాజన్న,మండల నాయకుడు బోడ బాపు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన అందిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమే

### గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన:

### డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కల్లెం రాఘవరెడ్డి



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి జూన్ 08 :**ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ప్రజాపాలన ప్రభుత్వంగా కాంగ్రెస్ పాలన కొనసాగిస్తుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కల్లెం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని ఫిలాయిపల్లి గ్రామంలో శనివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి అందించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు మండల వ్యాప్తంగా గ్రామ గ్రామానశంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లాయిపల్లి గ్రామంలో సుమారు 45 మంది లబ్ధిదారుల ఎంపిక కాదా సుమారు 20 మంది ఇండ్ల నిర్మాణ పనుల కోసం ముగ్గ ఈ కార్యక్రమనీ నిర్వహించారు ఈ సందర్భంగాముఖ్య అతిథిగా ఆయన హాజరై లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో భాగంగా ఇండ్లు లేని ప్రతి ఒక్కరికి ఇండ్లను అందించే విధంగా ఆనాడు సీఎం రేవంత్ ఇచ్చిన మాట ప్రకారం నేడు ప్రతి పేదవారికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి ఇండ్లను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టడం గొప్ప విషయమని ఆయన అన్నారు. గతం పదేండ్ల టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ అర్హులైన పేదవారికి ఇండ్లు అందించడం గొప్ప విషయం అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గోడిసె భూషణ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కంచర్ల రాజశేఖర్ రెడ్డి, నాయకులు మాజీ ఉప సర్పంచ్ పడాల సతీష్ చారి, మండల ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్ ,నాయకులు తోట బాబు తదితరులు పాల్గొన్నారు..

## బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

### కళ్యాణలక్ష్మి చెక్కులందించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల

**మిర్యాలగూడ నవభూమి, జూన్ 8:-**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఆధ్వర్యంలో కాల్వపల్లి గ్రామానికి చెందిన మేడబోయిన గంగాభవాని కూతురు కాల్వపల్లి తండా గ్రామానికి చెందిన ధీరవత్ హరికోటి , పార్వతిల కూతుర్లకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను ఆదివారం పంపిణీ మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందని మొదటి నుండి కూడా బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన కాంగ్రెస్ పార్టీ ఈరోజు ప్రకటించిన మంత్రి వర్గ విస్తరణలో ఎస్సీలకు రెండు, బీసీకి ఒకటి కేటాయించి మరొకసారి సామాజిక న్యాయం పాటించడంలో చరిత్ర సృష్టించినదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఇస్తుందని కాంగ్రెస్ తోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాల్వపల్లి మాజీ సర్పంచ్ మండల కాంగ్రెస్ నాయకులు జంగిలి లింగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ తండా గ్రామ శాఖ అధ్యక్షులు శిరిశాల సాలయ్య, ధీరావత్ లింగానాయక్, ఇస్లావత్ కృష్ణ, నూకపంగ మోహన్ కుమార్, మేడబోయిన సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నవభూమి
www.navabhoomi.in
9 హైదరాబాద్ సోమవారం 09,జూన్,2025

# భూ కబ్జాకు కాంగ్రెస్ అధ్యక్షుడి యత్నం



**పాలకుర్తి--నవభూమి :** తాను కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని కబ్జా చేయడానికి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు యత్నిస్తున్నాడని పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు తన కుటుంబ సభ్యులతో కలిసి రాజీవ్ చౌరస్తాలో ధర్నాకు దిగాడు. సుమారు అర్ధగంటపాటు ఎండలో ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళితే%% మల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతం వెంకన్నకు ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్య కుమారుడికి వెంకన్న భూమి రిజిస్ట్రేషన్ చేశాడు. పెద్ద భార్య ఆమె కుమారుడు 2009లో ఖమ్మం జిల్లాకు చెందిన కొనకంచి సురేశ్‌కు ఆ 5ఎకరాల 20గుంటల భూమిని విక్రయించారు. తిరిగి ఆ భూమిని మల్లంపల్లి గ్రామానికి వలస వచ్చిన వడ్డెర కులానికి చెందిన రూపాని యాదమ్మ, సాలయ్య దంపతులకు సురేశ్ విక్రయించాడు. కొన్నేళ్లు వ్యవసాయం చేసుకున్నారు.వృత్తిరీత్యా సాలయ్య, యాదమ్మ దంపతులు వలస పోగా ఆ భూమిని చింతం వెంకన్న కబ్జా చేశాడు. ఈ విషయంలో కొన్నేళ్లుగా ఇరువర్గాలకు మధ్య పంచాయతీ, కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే స్థానిక నాయకుల అండదండలతో 2024లో చింతం వెంకన్న భూమిని సాగు చేయడానికి వెళ్లాడు. దీంతో రూపాని యాదమ్మ, సాలయ్య కుటుంబ సభ్యులకు చింతం వెంకన్నతో గొడవ జరిగింది. చింతం వెంకన్నతోపాటు కొడుకు, కుటుంబ సభ్యులు రూపాని యాదమ్మ, ఆమె కొడుకు, కుమార్తెలపై దాడి చేశారు. ఇరువర్గాలు గొడవకు దిగాయి. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి.

## క్యాన్సర్ రోగులకు ఉపశమనం




**నిర్మల్-నవభూమి:** రోగుల జీవన ప్రమణాన్ని మెరుగుపరచడంతోపాటు క్యాన్సర్ మహమ్మారితో పోరాడే సహజ సామర్థ్యాన్ని పెంచేందుకు వైద్య కళాశాల ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్య సేవలందించేందుకు నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో 20 పడకల చొప్పున జెరియాట్రిక్ వార్డులు, క్యాన్సర్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలియేటివ్ కేర్ కేంద్రం ఏర్పాటయింది. ఇక్కడ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందిస్తున్నారు. నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జెరియాట్రిక్ వార్డులు, క్యాన్సర్ కేంద్రాలను త్వరలో ప్రారంభం కానున్నాయి. క్యాన్సర్ కేర్ కేంద్రం, పాలియేటివ్ కేర్ పక్షవాతంతోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగించేందుకు ఉపయోగించనున్నారు. ఇందుకు ఆసుపత్రిలో ప్రత్యేకంగా వార్డులు ఏర్పాటు చేశారు. జెరియాట్రిక్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతవాసులకు ప్రయోజనం చేకూరనుంది. అందుబాటులో సేవలువృద్ధాప్యంలో గుండె జబ్బులు, షుగర్, బీపీతోపాటు ఇతర వ్యాధులు ఉండడం వల్ల వీటిని ఎదుర్కోవడం కష్టతరమవుతుంది. అలాంటి వాటికి ప్రత్యేక వార్డుల్లో నైపుణ్యం కలిగిన వైద్యులు(జెరియాట్రిషన్లు) అందుబాటులో ఉండి అవసరమైన చికిత్సలు, మందులు అందిస్తారు. శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్య అంశాలను సమగ్రంగా పరిశీలించడం, వృద్ధులు ఎదుర్కొనే సమస్యలను ముందుగా గుర్తించడం, ప్రతిరోగి అవసరాలకు అనుగుణంగా చికిత్స విధానం రూపొందిస్తారు.ఒంటరితనం, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు కౌన్సెలింగ్ ఇస్తారు. జెరియాట్రిక్ వార్డులలో సేవలన్నీ ఒకే చోట లభిస్తాయి. కీమోథెరపీ, రేడియేషన్, కౌన్సిలింగ్ వంటి సేవలు ఒకే చోట లభిస్తాయి. చికిత్సలు రోగులకు అందుబాటులో లభించడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదు. సమయం, డబ్బు ఆదా అవుతుంది. క్యాన్సర్ కేంద్రాలలో రోగ నిర్ధారణ, చికిత్స త్వరగా అందే ఆస్కారం ఉంది.

## ఇంటినంబర్ ఇచ్చేయ్ రిజిస్ట్రేషన్ చేసేయ్

**ఆదిలాబాద్-నవభూమి :** ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలతోపాటు, కిరాయితో ఉంటున్న ఇండ్లకు మున్సిపాలిటీ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించడం, అక్రమార్కులు ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వెలుగులోకి వస్తున్నాయి. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలతో ఫిర్యాదులు రావడంతోపాటు యజమానులు తమ ఇంటికి ఇతరులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.స్థలాల అక్రమణలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ కబ్జాదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు ఉన్నాయని నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాదారులు మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకుంటున్నారు. మరికొందరు తాము కిరాయి ఉంటున్న ఇండ్లకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మున్సిపాలిటీలో ఫేక్ డోర్ నంబర్ తీసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తమ పేరిట యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నారు.అధికారుల వ్యవహారశైలిపై ఆరోపణలు మున్సిపాలిటీ అధికారులు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో షెడ్లు, ఇతరుల పేరిట ఉన్న స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా తమ సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకునే ఇందుకు సంబంధించిన అన్ని పత్రాలు, లింక్ డాక్యుమెంట్‌లతో మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకుంటే అన్ని పరిశీలించిన అధికారులు డోర్ నంబర్‌లు కేటాయించాలి. కిరాయి ఉంటున్న వారు నకిలీ పత్రాలు సృష్టించి దరఖాస్తు చేసుకుంటే ఇంటి నంబరు ఇవ్వడం కుదరదు.మున్సిపాలిటీ అధికారులు ఖాళీ స్థలాల్లో షెడ్లకు ఇంటి నంబర్లు, కిరాయికి ఉంటున్న వారు నకిలీ పత్రాలతో దరఖాస్తు చేసుకున్నా డోర్ నంబర్లు కేటాయిస్తున్నారు. ఇంటి నంబర్లు ఆధారంగా అక్రమార్కులు విలువైన స్థలాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. గతంలో మున్సిపాలిటీ కేటాయించిన ఇంటి నంబర్ల రిజిస్ట్రేషన్ చేయాలంటే రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు మున్సిపల్ కమిషనర్ నుంచి అభ్యంతరం లేదనే పత్రాలు తీసుకురమ్మనే వారు. ఇప్పుడు ఆ నిబంధన అమలు చేయడం లేదు. అక్రమణలపై పోలీసులకు ఇప్పటికే పలు ఫిర్యాదులు రాగా విచారణ జరిపి నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. అక్రమార్కులపై పోలీసులు తీసుకుంటున్న చర్యలను ప్రజలు అభినందిస్తున్నారు.

## నరకప్రాయంగా పల్లె రహదారులు

**భైంసా-నవభూమి :** భైంసా మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పడి, కంకర తేలి, వంకలుగా ఉండి వాహనదారులు, పాదచారులు నడువ లేని దుస్థితి నెలకున్నది. మండలంలోని పెండ్‌పల్లి, ఇలేగాం, ఖత్‌గాం, సిరాల, మహగాం-చింతల్‌బోరి, సిద్దూర్, వాలేగాం-రంగరివాడ, వాడి గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం భైంసా మండలానికి వస్తుంటారు. విద్యార్థులు చదువుకోవడానికి, కూలీలు పనులకు, దవాఖానలకు వంటి ప్రజలు వివిధ పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు.మూడు కిలో మీటర్ల మేర పెండ్‌పల్లి రహదారి, రెండు కిలోమీటర్ల మేర ఇలేగాం, రెండు కిలోమీటర్ల మేర ఖత్‌గాం, రెండు కిలోమీటర్ల మేర సిరాల, రెండు కిలోమీటర్ల మేర మహగాం-చింతల్‌బోరి, కిలోమీటరు మేర సిద్దూర్, మూడు కిలో మీటర్ల మేర వాలేగాం-రంగరివాడ, రెండు కిలోమీటర్ల మేర వాడి గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీటిలో పెండ్‌పల్లి, ఖత్‌గాం గ్రామాలకు రూ.కోటి చొప్పున నిధులు కూడా కేటాయించారు. అయినా పనులు ప్రారంభం కాలేదు. తాజాగా పది రోజుల క్రితం ఖత్‌గాం గ్రామస్తులు రహదారులను బాగు చేయాలని ధర్నా కూడా చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సర్కారోళ్లు స్పందించి రోడ్డలను బాగు చేయించాలని పల్లెవాసులు కోరుతున్నారు.



# టైగర్ కారిడార్‌పై కన్నెర్ర

**కుమ్రం భీం ఆసిఫాబాద్-నవభూమి :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తుండడంపై ఆదివాసులు కన్నెర్ర చేశారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తుడుం మోగించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 49ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. శనివారం జిల్లా నలుమూలల నుంచి వందలాదిగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకొని భారీ ర్యాలీ తీశారు. తుడుం వాయిద్యాలతో కుమ్రం భీం చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు చేరుకొని అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు.అక్కడి నుంచి వివేకానంద చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు కదం తొక్కారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎంపీ సోయం బాపూరావ్ మద్దతు ప్రకటించి.. ఆందోళనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన ఆందోళన సుమారు ఐదుగంటల పాటు కొనసాగింది. సర్కారు వెనక్కి తగ్గకపోతే మరో కుమ్రం భీం పోరాటం మొదలవుతుందని హెచ్చరించారు.సంఘటిత పోరాటం చేస్తాం జీవో 49 రద్దు కోసం ఆదివాసీలతో కలిసి సంఘటితంగా పోరాటం చేస్తాం. ప్రతి గ్రామంలో ఉద్యమాలు చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందిస్తాం. ప్రతి గ్రామంలో నల్ల జెండాలతో నిరసనలు చేపడుతాం. టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా గిరిజనులు చేపట్టే ప్రతి ఉద్యంలో పాల్గొని వారి వెన్నంటే ఉంటాము. టైగర్ కారిడార్‌తో గిరిజనుల బతుకులు ఆగమవుతాయి. అటవీ ప్రాంతాల్లో వందేళ్లకు ముందే ఏర్పడిన గ్రామాలకు రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. కనీసం తాగు నీటి కోసం బోర్లు కూడా వేయనీయడం లేదు. ఇది న్యాయం కాదు.ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. జీఓ 49 రద్దుచేసేవరకు పోరాడుతాం. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కారణంగానే జీవో 49 వచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకారం అందించింది. ఆదివాసీలను అడువుల నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే టైగర్ కారిడార్ పేరుతో ఈ జీవోను తీసుకువచ్చారు. ఈ జీవో రద్దుకోసం రాష్ట్ర ప తిని కలిసేందుకు ప్రయత్నం చేస్తాం. ఆదివాసీల సం ఘాలను కలుపుకొని పోరాటాలు చేస్తాం. ఇకపై గిరిజనుల మీద అధికారులు వేధింపులకు పాల్పడితే.. అటవీ అధికారులపై కూడా గిరిజనులు కేసులు పెట్టాలి.కేసీఆర్ పోడు పట్టాలిస్తే.. కాంగ్రెస్ అడ్డుకుంటుంది.గిరిజనులు సాగు చేసుకుంటున్న



అటవీ భూములకు కేసీఆర్ పోడు పట్టాలిచ్చి ప్రభుత్వ పథకాలు వర్తింపజేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను సాగు చేసుకోకుండా అడ్డుకుంటోంది. టైగర్ కారిడార్ పేరుతో ఏకంగా గిరిజనుల భూములను పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు చేస్తోంది. టైగర్ కారిడార్ పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ను వెంటనే రద్దుచేయకపోతే మరో కుమ్రం భీం పోరాటం మొదలవుతుంది. ఆదివాసీలమంతా ఏకమై ఆందోళనలు చేపడుతాం. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం.గిరిజనులపై ఎందుకీ వివక్ష ఇంద్రవెల్లి సభలో ఆదివాసీలపై ప్రేమను ఒలకబోసిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు మాత్రం ఆసిఫాబాద్ జిల్లా గిరిజనులపై వివక్ష చూపుతున్నారు. హైదరాబాద్‌లో అడవులను ఆక్రమించుకునేందుకు జింకలను చంపిన రేవంత్ రెడ్డి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పులులను కాపాడేందుకు ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. ఆదివాసీలు నివసించే ఆసిఫాబాద్ అడవులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్‌కు రూ.7,700 కోట్ల నిధులు తెస్తున్న అధికారులు ఐటీడీఏను ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారో చెప్పాలి. ఆదివాసీల బతుకులు ఆగం చేసేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారు.అధికారులను గ్రామాల్లోకి రానివ్వం జీవో 49ని రద్దుచేయక పోతే అడవుల్లోకి అటవీ అధికారులను రానివ్వం. టైగర్ కారిడార్ పేరుతో పోడు రైతులను వేధిస్తే అటవీ అధికారులను ప్రతిఘటిస్తాం. ఆదివాసీలను కేవలం ఓటు బ్యాంకుగానే పార్టీలు వాడుకుంటున్నాయే తప్ప వారి కోసం ఏ పార్టీ కూడా చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. ఆదివాసీలను అంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుంది. రాంజీగోండ్ కుమ్రం భీం స్ఫూర్తితో ఆదివాసులు మరోపోరాటానికి సిద్ధం కావాలి.

# మెడికల్ మాఫియా జోరో దందా!?

**పెద్దపల్లి-నవభూమి :** పెద్దపల్లి జిల్లాలో మెడికల్ షాపులపై నియంత్రణ కొరవడింది. తకువ ధరకే దొరికే జనరిక్ మందులను అధిక ధరకు విక్రయిస్తూ సామాన్యులను దోచుకుంటున్నారు. జ్వరం వచ్చిందనో.. జలుబు చేసిందనో డాక్టర్ దగ్గరకు వెళ్తే.. వంద నుంచి 500 వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో పేదలు నేరుగా మెడికల్ షాపులకు వెళు ుండగా, ఇదే అదనుగా షాపు యజమానులు దండుకుంటున్నారు.వైద్యుడి ప్రిస్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు మెడికల్ దుకాణాలకు ఇచ్చే ప్రతి డ్రగ్‌పై బ్యాచ్ నంబర్ ఉంటుంది. ఇలా రిటైల్ దుకాణాలకు ఇచ్చే సమయంలో బిల్లుపై పొందుపర్చిన బ్యాచ్ నంబర్, కొనుగోలుదారులకు ఇచ్చే బిల్లుపై రాసే బ్యాచ్ నంబరు కూడా ఒక విధంగా ఉంటేనే సరైనవేనని నమ్మవచ్చు. కానీ, రెండు బిల్లులపై వేర్వేరు నంబర్లు ఉండడంతో నకిలీ మందుల దందా కొనసాగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.నియంత్రణ కరువు హోల్‌సెల్ ఏజెన్సీలతోపాలు, మెడికల్ దుకాణాలపై ఔషధ నియంత్రణ విభాగం నిఘా పూర్తిగా కొరవడింది. పెద్దపల్లి జిల్లాలో ఎన్ని షాపులకు అనుమతి ఉంది? నిబంధనలు అతిక్రమిస్తూ మందులు ఎవరు విక్రయిస్తున్నారనే విషయంపై తనిఖీలు ఉండడం లేదు. దీంతో మందుల పాపుల యజమానులు జనరిక్ మందులు ఇచ్చి బ్రాండెడ్ మందుల ముసుగులో దోపిడీ చేస్తున్నారు. ఒకే రకమైన మందుల్ని తయారు చేస్తున్న కొన్ని కంపెనీలు జనరిక్‌పై ఒక ధర, బ్రాండెడ్ మందులపై మరో ధర ముద్రిస్తున్నాయి. మరికొన్ని కంపెనీలు రెండు ధరలను ముద్రించడంతో గందరగోళం నెలకొంటున్నది. దీంతో రెండు రకాల మందుల ధరల్లో భారీ వ్యత్యాసం ఉంటున్నది.నిబంధనలు గాలికి..వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దనే నిబంధనను మెడికల్ షాపుల యజమానులు తుంగలో తొకుతున్నారు. మెడికల్ షాపు నిర్వహించే ఫార్మసిస్టు డ్రెస్ కోడ్‌తోపాటు మందులు అందించే సమయంలో గ్లౌజులు వేసుకోవాలి. కొన్ని మందులను ఫ్రిజ్‌లో మాత్రమే భద్రపరచాలి. వినియోగదారుడికి కచ్చితంగా మందుల వివరాలతో కూడిన బిల్లు ఇవ్వాలి. కానీ, ఏదో ఒకటి, రెండు షాపుల్లో తప్ప మిగతా దుకాణాల్లో ఇది అమలు కావడం లేదు. మెడికల్ దుకాణాల యజమానుల యూనియన్ కనుసన్నల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు నడుస్తున్నారనే ఆరోపణలున్నాయి.కమీషన్




మాయాజాలంమందుల విక్రయం పెద్ద వ్యాపారంగా మారింది. తమ కంపెనీకి చెందిన కోటి విలువ చేసే మందులు సేల్ చేస్తే అందులో 40 శాతం కమీషన్ ఇస్తామని నిర్వాహకులు వైద్యులతో ఒప్పందాలు చేసుకుంటున్నటు తెలుస్తున్నది. దీంతో వైద్యులు ఆ కంపెనీ మందులు సేల్ చేసేందుకు అవసరం ఉన్నా లేకున్నా రోగుల నెత్తిన రుద్దుతున్నారు. ప్రొటీన్ పౌడర్ బ్రాండెడ్ 150కి లభిస్తుండగా జనరిక్‌లో 25కు లభిస్తుంది. ఎన్జైమ్ సిరప్ 60కు లభిస్తే జనరిక్‌లో 25కు, ట్యాబ్లెట్ ఎసినిక్ ప్లస్ బ్రాండెడ్‌లో 50కు లభిస్తుండగా, జనరిక్ షాపుల్లో 10లకు దొరుకుతున్నది. అయితే, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయని కారణంగా రోగులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు.తెరుచుకోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్‌పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల ఔషధ తనిఖీ అధికారి (డ్రగ్ ఇన్‌స్పెక్టర్) కార్యాలయం అసలు తెరుచుకోవడం లేదు. ఈ విషయంపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించగా.. తమ కార్యాలయానికి సిబ్బంది లేరని, తాను ఎప్పుడూ తనిఖీలు, ఇతర కేసులకు సంబంధించి వెళ్లాల్సి ఉంటుందని, అందువల్లే కార్యాలయంలో ఉండడం లేదని తెలిపారు. అయితే జిల్లాలో తనిఖీలు జరిగినట్లు కూడా నెలకు ఒక్క ప్రకటన కూడా మీడియాకు రాదు. దీంతో అసలు జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నాడా.. లేడా? అన్నట్టుగానే ఉన్నది.

## కారు ఢీ :మహిళ మృతి



**మిర్యాలగూడ నవభూమి జూన్ 8:-** మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామం వద్ద నార్కట్ పల్లి - అద్దంకి స్టేట్ హై వే పై కారు ఢీ కొట్టగా మహిళ మరణించారు. మిర్యాలగూడ పట్టణం షాబునగర్ కి చెందిన పొట్లూరి అలివేలు తన తల్లి బొజ్జ యశోదతో కలిసి గుంటూరుకు సొంత పనిమీద వెళ్లి తిరిగి అదే రోజు సాయంత్రం 6 గంటలకు గుంటూరు నుండి మిర్యాలగూడకు లారీలో వస్తుండగా మార్గమధ్యలో కిష్టాపురం గ్రామ శివారులో లారీ డ్రైవర్ తన లారీని ఆపి బహిర్భూమికి వెళ్ళగా అలివేలు తన తల్లి యశోదాలు మూత్ర విసర్జన కోసం లారీ దిగి రోడ్డు దాటి అనంతరం తిరిగి లారీ ఎక్కేందుకు లారీ వద్దకు వస్తుండగా శనివారం రాత్రి 10 గంటల సమయంలో గుంటూరు నుండి మిర్యాలగూడ వైపుకు వస్తున్న ఏపీ 07 డి 8989 కారు డ్రైవర్ తన కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపి రోడ్డు దాటుతున్న అలివేలును ఢీ కొనగా తలకు, ఎడమ చేతికి కాళ్లకు బలమైన గాయాలయ్యి అక్కడికక్కడే మరణించారనే విషయమై అలివేలు తల్లి బొజ్జ యశోద ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

## టిప్పర్ ఢీ :3 గేదెలు, ఒక దూడ మృతి



**మిర్యాలగూడ నవభూమి, జూన్ 8:-** మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన సిరికొండ వెంకటమ్మ 3 గేదెలు మరియు రెండు దూడలు మేత కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాకపోగా ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో వెంకటమ్మ తన గేదెలను వెతికి ఇంటికి తీసుకొని వస్తుండగా అదే సమయంలో ఆలగడప వైపు నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న టిప్పర్ ఏపి 04 యుబి 0334 అనుగలధాని డ్రైవరు తన టిప్పర్ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి గేదెలకు ఢీ కొట్టగా మూడు గేదెలు ఒక దూడ అక్కడికక్కడే చనిపోయి, ఒక దూడకు గాయాలయ్యాయని గేదెల యజమాని అయిన వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. గేదెల విలువ సుమారు లక్షన్నర రూపాయల వరకు ఉంటుందని వెంకటమ్మ పేర్కొన్నారు.

## పిచ్చోడి చేతిలో రాయిలా రాష్ట్రం

**నార్కట్‌పల్లి-నవభూమి:** సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి ఒరగబెట్టింది ఏమీలేదని, కాంగ్రెస్ అం టేనే ఖయ్యాలకు కాలు దువ్వే పార్టీ అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం పట్టణకేంద్రంలోని తన నివాసంలో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పదేండ్లు పారదర్శకంగా ముందుకు నడిపిందని, కానీ ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. అం దుకే తెలంగాణకు మళ్లీ సీఎంగా కేసీఆరే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.కేవలం తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను తిట్టడానికే సీఎం రేవంత్ ఆలేరులో సభ పెట్టుకున్నారని విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ స్వాగతం పలికిందే తప్పా.. ఎక్కడా అడ్డుకోలేదని గుర్తు చేశారు. తెలంగాణ తీసుకొచ్చిన కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఎవరికీ లేదన్నారు. గతంలో రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకున్న కాంగ్రెస్.. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గంధమల్లకు మళ్లీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు.కాళేశ్వరం, మల్లన్నసాగర్ లేకుండా గంధమల్లకు నీళ్లు రావనేది కాంగ్రెస్ నాయకుల గ్రహించాలన్నా రు. గతంలో యాదగిరి క్షేత్ర సన్నిధిలో మెడికల్ కళాశాలకు రూ.182 కోట్లు మంజూరు చేసి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. మళ్లీ చేసిన పనులకే శంకుస్థాపన చేయడం అనేది సిగ్గుచేటని విమర్శించారు. యాదాద్రిని యాదగిరి గుట్టగా మార్చడాన్ని ఎవరూ స్వాగతించలేదని, కేసీఆర్ పేరు యాదగిరి క్షేత్రంపై సువర్ణాక్షరాలతో చెక్కబడే ఉంటుందన్నారు.పదేం డ్ల కేసీఆర్ సంపద సృష్టిస్తే కాంగ్రెస్ కొల్లగొడుతుందని విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా లేరని, అందుకే కాంగ్రెస్ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని చురకలు అంటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణుమూర్తి, మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్, దుబ్బాక శ్రీధర్, పక్కీర్ సత్తిరెడ్డి, జినుకల కార్తీక్ పాల్గొన్నారు.

# కరీంనగర్ బస్టేషన్‌లో భద్రత డొల్ల

**కరీంనగర్-నవభూమి:** జిల్లా కేంద్రంలో బస్టేషన్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలివెళ్లే లక్షలాది ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణికుల తరలింపులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే ఉంది. రీజియన్ పరిధిలోని 11 డిపోలకు చెందిన 911 బస్సులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రీజియన్ల నుంచి నిత్యం 1800 బస్సులు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి.బస్టాండ్‌లో 43 ప్లాట్ ఫారంలు ఉండగా, వచ్చీపోయే వారితో సందడిగా ఉంటుంది. అయితే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయా ణం కల్పించడంతో ఏడాదిన్నరగా రోజూవారీ ప్రయాణికుల సంఖ్య 60వేల నుంచి 90 వేలకు పెరిగింది. పండుగలు, వారంతపు సెలవుల్లో ఈ సంఖ్య మరో 20 వేలు ఎక్కువగా ఉంటున్నది. ఇంత మంది ప్రయాణికుల రద్దీతో కళకళలాడే బస్టేషన్‌లో భద్రత లోపించడంతో కొన్ని రోజులుగా దొంగతనాలకు కేరాఫ్‌గా మారిపోగా, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. విజిలెన్స్‌లో సిబ్బంది కొరతఆర్టీసీలో విజిలెన్స్ ప్రత్యేక విభాగం ఉన్నా సిబ్బంది కొరత వేధిస్తున్నది. 14 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండాల్సి ఉండగా, కేవలం ఆరుగురే ఉన్నారు. పని ఒత్తిడితో పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించలేకపోతున్నారని తెలుస్తున్నది. సీఐ, ఏఎస్ఐ, కానిస్టేబుల్ ఉన్నా సరిపడా సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. జోనల్ విజిలెన్స్ అధికారి నెల రోజులుగా సెలవుపై వెళ్లడంతో పర్యవేక్షణ లోపం కనిపిస్తున్నది. లక్షలాది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే బస్టేషన్‌లో భద్రత పెంచాలని, దొంగతనాలు




జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రయాణికుల భద్రతకు అన్ని రకాల చర్యలు..బస్టేషన్‌లో ప్రయాణికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పోలీసుల ఆధ్వర్యంలో ఔట్ పోస్టు కూడా ఏర్పాటు చేశాం. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పగలూ రాత్రి పనిచేస్తున్నారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం. పాడైన సీసీ కెమెరాలను వెంటనే సరిచేస్తున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సిబ్బందిని సంప్రదించాలి.పనిచేయని కెమెరాలు.. ఔట్ పోస్టుతో నిష్ప్రయోజనం..బస్టేషన్‌లో జేబు దొంగల బెడద ఎక్కువైంది. ప్రయాణికుల బంగారు నగలు, బ్యాగులు, సెల్‌ఫోన్ల దొంగతనాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అయితే ప్రయాణికుల భద్రత కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ నిధులతో బస్టేషన్‌లో 65 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, అందులో మెజార్టీ పనిచేయడం లేదు. కొన్ని పనిచేసినా పోలీసులకు ఆపరేటింగ్ రాకపోవడంతో ఘటన జరిగినప్పుడు వెనువెంటనే స్పందించలేకపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఇదిలా ఉండగా, దొంగతనాల అడ్డుకట్టకు పోలీసు శాఖ తరపున బస్టాండ్‌లో గత ఏప్రిల్ 29న పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేశారు. షిఫ్ట్‌కు ముగ్గురు సిబ్బంది చొప్పున రోజు మూడు షిఫ్ట్‌లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా దొంగతనాలు ఆగడం లేదు. గత మే నెల 23న నగరానికి చెందిన శారద అనే మహిళ హైదరాబాద్ బస్సు ఎక్కి టికెట్ తీసుకునే సమయంలో బ్యాగులోని 5 తులాల బంగారం కనిపించలేదు.సమాచారం మేరకు పోలీసులు వచ్చి బస్సులను తనిఖీ చేసినా, బంగారం లభించలేదు. అదే వారంలో సిద్దిపేట వెళ్తున్న ప్రయాణికుడి జేబులోంచి రూ.లక్షను కొట్టేశారు. ఇలా రోజూ రెండు,మూడు ఘటనలు జరుగుతున్నాయి. ఇవి కాకుండా ఇటవలి కాలంలో పోకిరీల వేధింపు ఘటనలు జరుగుతున్నాయి. అయితే ఘటన జరుగగానే వెంటనే స్పందించాల్సిన ఔట్ పోస్టు పోలీసులు బాధితులను పోలీసుస్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన ప్రయాణికులు ఠాణాల చుట్టు తిరగలేక తిరుగు ప్రయాణమతున్నారు.